క్లుప్తంగా

సిబ్బంది సమన్వయంతో పనిచేయాలి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ రవివర్మ

ముమ్మిడివరం: ప్రజలకు సేవలు అందించేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలని కమిషనర్ పి.రవివర్మ అన్నారు. స్థానిక నగర పంచాయతీ సమావేశ మందిరంలో అన్ని శాఖల, నగర పంచాయతీ కార్యాలయ సిబ్బందికి పలు అంశాలపై శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ రవివర్మ మాట్లాడుతూ పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాల నిర్వహణ వంటి అంశాలకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. సకాలంలో పన్నులను వసూలు చేయాలని సూచించారు. ప్రజల అవసరాలను తీర్చేలా సిబ్బంది సేవలు ఉండాలన్నారు. సమావేశంలో ఏఈ సుధాకర్, మేనేజర్ పీవీ నూకరాజు, ఆర్ఐ భాస్కరరావు, జేఏఓ రామకృష్ణ, జె.సత్యనారాయణ, సునీత, రామకృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గౌతమ బుద్ధునికి పూజలు



గౌతమి బుద్ధుని విగ్రహం వద్ద పూజలు చేస్తున్న స్థానికులు

అల్లవరం: తాడికోనలో గౌతమ బుద్ధుని ఆరో వార్షికోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. పేదపేటలో నందిక సిద్ధార్థకుమార్ ఆధ్వర్యంలో గౌతమి బుద్ధుడు బోధించిన పంచశీల సూత్రాలపై పలువురు ఉపన్యసించారు. ఈ సందర్భంగా బుద్ధుని విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. సర్పంచ్ సాధనాల సూర్య వెంకట నాగమణి, మట్టా వెంకటరావు, గెద్దం భాస్కరరావు, ఉండ్రు శ్యామలరావు, జల్లి శ్రీనివాస్, ఉండ్రు వెంకటేష్, దాసరి బాలస్వామి, గోసంగి స్టాలిన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పీఎం స్వనిధి రుణాలపై అవగాహన



వీధి వ్యాపారులు, డ్వాక్రా మహిళలకు అవగాహన కల్పిస్తున్న బ్యాంక్ అధికారులు

అమలాపురం టౌన్: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో స్థానిక యూకో బ్యాంక్‌లో పీఎం స్వనిధి రుణాలపై ఆ బ్యాంక్ అధికారులు వీధి వ్యాపారులు, డ్వాక్రా మహిళలకు శుక్రవారం అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలైన స్వనిధి బి, స్వభిమాన్ బి పక్వాడ రుణాలు పొందే విధానాలను వివరించారు. మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు మాట్లాడుతూ స్వనిధి రుణాలపై ఈ నెల 18 నుంచి డిసెంబర్ 2వ తేదీ వరకూ పట్టణంలోని అన్ని వాణిజ్య బ్యాంక్‌ల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పీఎం స్వనిధి యాప్‌ను ఏ విధంగా ఇన్‌స్టాల్ చేసుకోవాలో వివరించారు. యూకో బ్యాంక్ మేనేజర్ సతీష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మెప్మా, ఐసీడీఎస్ అధికారులు, మెప్మా కమ్యూనిటీ ఆర్గనైజర్లు, రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

యానాం సబ్ జైలుకు ఇద్దరు ఖైదీలు

యానాం: పుదుచ్చేరిలోని కాలాపేట సెంట్రల్ జైలు నుంచి ఇద్దరు కరుడుగట్టిన శిక్ష అనుభవిస్తున్న ఖైదీలను శుక్రవారం యానాం సబ్ జైలుకు బదిలీ చేస్తూ తీసుకువచ్చారు. పలు కిడ్నాప్‌లు, హత్య కేసుల్లో యావజ్జీవ శిక్ష అనుభవిస్తున్న వనరపేటకు చెందిన చాందవ మణికంఠన్‌ను, అదేవిధంగా పలు కేసుల్లో శిక్ష అనుభవిస్తున్న పెరుమాల్‌రాజును ఇక్కడకు తరలించారు. కాలాపేట సెంట్రల్ జైలులో భోజనం తయారు చేస్తున్న ఖైదీలతో వీరు ఘర్షణకు దిగినట్లు సమాచారం. దీంతో యానాం సబ్ జైలులో మరింత భద్రత పెంచారు.

రెండు షాపుల్లో చోరీ

అల్లవరం: స్థానిక పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో గురువారం రాత్రి రెండు షాపుల్లో చోరీలు జరిగాయి. సుమారు రూ.2.2 లక్షల విలువైన సామగ్రిని అపహరించారు. అల్లవరంలో సత్య ఫొటో స్టూడియోలోని నికాన్ కెమెరా, లెన్స్, విలువైన సామగ్రి చోరీ చేశారు. స్టూడియో పక్కనే టైలరింగ్ షాపు వెనుక వైపు తలుపును గునపంతో పెకలించి చోరీకి పాల్పడ్డారు. బాధితులు ఈటీ వెంకటేశ్వరరావు, మేడిద సుబ్బారావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అల్లవరం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

నిధుల విడుదల

యానాం: యానాం, పుదుచ్చేరి, మాహే, కారైకల్ రీజియన్లలో అభివృద్ధి పనులకు సంబంధించి 2024–25 సంవత్సరానికి గాను రూ.66 కోట్ల ఎమ్మెల్యే ల్యాడ్ నిధులు విడుదల చేసినట్లు శుక్రవారం లోకల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ కార్యదర్శి ఆర్.రత్న ఓ ప్రకటనలో తెలిపారు.

కష్టతరమేనూ..

- పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వడ్డించేదెలా!
- పెరిగిన ధరలతో ఇబ్బందుల్లో నిర్వాహకులు



కోడూరుపాడు పాఠశాలలో మధ్యాహ్న భోజనానికి క్యూలో విద్యార్థినులు

అమలాపురం రూరల్: ధరలు పెరుగుతున్నాయి.. పప్పు నుంచి ప్రతి కూరగాయ వరకూ అన్నీ ఆకాశాన్నంటాయి.. పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెంచేందుకు అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకానికి అందించే మెనూ ధరలు మాత్రం అలానే ఉన్నాయి.. పెరుగుతున్న ధరలకు తగ్గట్టుగా ప్రభుత్వం బడ్జెట్ పెంచకపోగా, నెలవారీ బిల్లులు సైతం సక్రమంగా ఇవ్వకపోవడంతో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిత్యావసరాలు, కూరగాయల ధరలు విపరీతంగా పెరిగాయి. దీని ప్రభావం సామాన్య ప్రజలపైనే కాదు పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకంపైనా పడింది. దీనికి తోడు మధ్యాహ్న భోజన కార్మికులకు గౌరవ వేతనాలు, ఎండీఎంకు చెల్లించాల్సిన బిల్లులు, వేతనాలు మూడు నెలల నుంచి చెల్లించడం లేదు. దీంతో విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించేందుకు ఎండీఎం ఏజెన్సీల మహిళలు అనేక అవస్థలు పడుతున్నారు. అమలాపురం నియోజకవర్గంలో మండలాల వారీగా పరిశీలిస్తే.. అమలాపురం రూరల్‌లో 105 పాఠశాలలకు 7,392 మంది విద్యార్థులు ఉండగా 5,830 మంది మధ్యాహ్న భోజనం చేస్తున్నారు. ఉప్పలగుప్తంలో 82 పాఠశాలల్లో 4,392 మంది విద్యార్థులకు 3,688 మంది, అల్లవరం మండలంలో 79 పాఠశాలల్లో 3,970 మంది విద్యార్థులకు 3,401 మంది మధ్యాహ్న భోజనం చేస్తున్నారు.

గతమెంతో ఘనం

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్యా రంగానికి ఎంతో ప్రాధాన్యం ఇచ్చింది. విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించేందుకు చర్యలు చేపట్టింది. నాడు–నేడు కార్యక్రమంలో పాఠశాలల రూపురేఖలు మార్చింది. దీంతో అప్పట్లో తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రభుత్వ బడులకు పంపించేందుకు ఆసక్తి చూపేవారు. విద్యార్థులు పాఠశాలల్లో సంతృప్తిగా భోజనం చేసేవారు. కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలలపై శ్రద్ధ కొరవడింది. ప్రభుత్వం పచ్చి బియ్యం సరఫరా చేస్తుందని, అన్నం ముద్దవుతుందని ఏజెన్సీల మహిళలు వాపోతున్నారు. ఎంత మంచి కూర వండినా ముద్దన్నంతో రుచి లేని చద్దన్నం తింటున్నట్టు ఉందని పలువురు విద్యార్థులు వాపోతున్నారు. ప్రస్తుతం ప్రాథమిక పాఠశాలల్లో చదివే విద్యార్థి ఒకరికి రూ.5.80, ఉన్నత పాఠశాల విద్యార్థికి రూ.8.14 చొప్పున ఇస్తున్నారు. ఏజెన్సీల మహిళలకు రూ.3 వేల చొప్పున గౌరవ వేతనం చెల్లిస్తున్నారు. విద్యార్థులకు అందించే చార్జీలను రూ.8, రూ.10కి పెంచాలని, ఏజెన్సీ మహిళలకు గౌరవ వేతనం రూ.3 వేల నుంచి రూ.5 వేలకు పెంచాలని కోరుతున్నారు. ప్రస్తుతం కూరగాయల ధరలు ఆకాశాన్నంటాయి. ప్రస్తుతం కిలో వంట నూనె రూ.150 నుంచి రూ.160 ఉంది. కందిపప్పు రూ.180కు చేరింది. ఇక మిగిలిన అన్ని సరకుల ధరలు గణనీయంగా పెరిగినా, మెనూ చార్జీలు మాత్రం పెంచడం లేదని నిర్వాహకులు వాపోతున్నారు.

వంట ఖర్చు రెట్టింపు



ప్రస్తుతం ధరలు బాగా పెరిగాయి. వంట ఖర్చులు రెట్టింపయ్యాయి. ఫలితంగా ఏజెన్సీలకు ఆర్థిక ఇబ్బందులు పెరుగుతున్నాయి. మెనూలో ఎటువంటి మార్పులు చేయడం లేదు. నాణ్యమైన ఆహార పదార్థాలు వాడుతున్నాం. వంట చేసే కార్మికులకు మాత్రం ఆర్థిక భారం పెరుగుతోంది.

–కొమ్ము సత్యవేణి, మధ్యాహ్న భోజన పథక సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి

వేతనాలు చెల్లించాలి



కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చాక నిత్యావసర, కూరగాయల ధరలు ఆకాశాన్నంటాయి. ఈ ధరలకు అనుగుణంగా పాఠశాలల్లోని మధ్యాహ్న భోజన పథక ఏజెన్సీలకు, ఈ పథకానికి చెల్లించే మెనూ చార్జీలు మాత్రం పెంచడం లేదు. నిర్వాహకుల గౌరవ వేతనాలూ పెంచాలి.

–కృష్ణవేణి, సీఐటీయూసీ జిల్లా కోశాధికారి

నేడు ద్వాదశ జ్యోతిర్లింగాల దర్శనం

ముమ్మిడివరం: స్థానిక శివారు పల్లిపాలెం శ్రీహరి సాకేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తిక మాసం శనివారం పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో భక్తుల దర్శనార్థం ద్వాదశ జ్యోతిర్లింగాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ పెన్మత్స చిట్టిరాజు తెలిపారు. అలాగే వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, దీపోత్సవం, సప్త హారతులు ఉంటాయన్నారు. భక్తుల సౌకర్యార్థం 216 జాతీయ రహదారి నుంచి ఆలయం వరకూ ఉచిత ప్రయాణ సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. అలాగే ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన ఉంటుందన్నారు. స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు.

మహిళ అదృశ్యంపై ఫిర్యాదు

ముమ్మిడివరం: కొంత కాలంగా పుట్టింట్లో ఉంటున్న తన కుమార్తె తనతో చిన్నపాటి గొడవ పడి ఇంటి నుంచి వెళ్లిపోయిందని గాలిదేవర అనంతలక్ష్మి ముమ్మిడివరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. మండలంలో సీహెచ్ గున్నేపల్లికి చెందిన కటికరెడ్డి అమ్మాజీ (36) కొంతకాలంగా భర్తతో విడిపోయి పుట్టింట్లోనే ఉంటుంది. ఈ నేపథ్యంలో గురువారం ఇంటి పనుల విషయంలో తనతో గొడవ పడిన తన కుమార్తె కనిపించకుండా పోయిందని అనంతలక్ష్మి శుక్రవారం ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్సై డి.జ్వాలాసాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

మిస్టర్ పుదుచ్చేరిగా యానాం వైద్య విద్యార్థి



మిస్టర్ పుదుచ్చేరి–2024గా ఎంపికైన రఘుచంద్ర (మధ్యలో)

యానాం: పుదుచ్చేరిలో పాండిచ్చేరి ఫ్యాషన్ మోడల్స్ అండ్ టాలెంట్స్, రోటరీ ఇంటర్నేషనల్, రోటరీ క్లబ్ పుదుచ్చేరి మరీనా ఆధ్వర్యంలో మిస్టర్, మిస్, అండ్ కిడ్స్ పోటీలు నిర్వహించారు. ఏఎస్పీ సెలాన్ అండ్ బ్రైడల్ స్టూడియో, పలు సౌందర్య ఉత్పత్తుల సంస్థలు స్పాన్సర్‌గా వ్యవహరించిన ఈ పోటీల్లో యానాంకు చెందిన కేతా రఘుచంద్ర మిస్టర్ పుదుచ్చేరి–2024గా ఎంపికయ్యారు. శుక్రవారం పుదుచ్చేరి రాక్‌బీచ్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు సెలబ్రిటీలు పాల్గొన్నారు.

రఘుచంద్రను న్యాయనిర్ణేతలు ఎంపిక చేశారు. అతను ప్రస్తుతం పుదుచ్చేరి వేంకటేశ్వర మెడికల్ కళాశాలలో జనరల్ మెడిసిన్‌లో పోస్టు గ్రాడ్యుయేషన్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. అయన్ని పలువురు అభినందించారు.

ఎస్పీని కలసిన శెట్టిబలిజ నాయకులు



ఎస్పీ కార్యాలయం వద్ద ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు, శెట్టిబలిజ సంఘాల నాయకులు

అమలాపురం టౌన్: అమలాపురంలో ఈ నెల 24న నిర్వహిస్తున్న శెట్టిబలిజ కార్తిక వన సమారాధనకు అనుమతి కోరుతూ జిల్లా ఎస్పీ బి.కృష్ణారావును ఆ సామాజిక వర్గ ప్రతినిధులు శుక్రవారం కలిశారు. ఉభయ తెలుగు రాష్ట్రాల శెట్టిబలిజ మహానాడు కన్వీనర్, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, మాజీ కౌన్సిలర్ వాసంశెట్టి సత్యం తదితరులు ఎస్పీని కలిసి 24న నిర్వహించే శెట్టిబలిజ కార్తిక వన సమారాధనకు పోలీస్ శాఖ నుంచి పూర్తి సహాయ సహకారాలు ఉండాలని కోరారు. రాష్ట్ర కార్మిక మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆధ్వర్యంలో జరిగే ఈ వన సమారాధనకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల నుంచి అధిక సంఖ్యలో తమ సామాజిక వర్గీయులు హాజరవుతారని, తగిన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. శెట్టి బలిజ సంఘాల నాయకులు వాసంశెట్టి చినబాబు, రాయుడు సత్యరుషి, దొంగ శ్రీను, కుడుపూడి వెంకటేష్, దొంగ కుమార్, పితాని శ్రీనివాస్, కుడుపూడి శ్రీరామ్ తదితరులు జిల్లా ఎస్పీ కార్యాలయానికి వెళ్లి ఎస్పీతో కార్తిక వన సమారాధన విషయమై సహాయ సహకారాలు అభ్యర్థించారు.

బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక



చన్యుత

అమలాపురం రూరల్: భట్లపాలెం బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో సీఎస్‌సీ ఆఖరి సంవత్సరం చదువుతున్న వడ్డేల చన్యుత భీమవరంలో ఇటీవల జరిగిన కాకినాడ జేఎన్‌టీయూ యూనివర్సిటీ బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ చాటింది. దీంతో ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైందని కళాశాల పీడీలు కె.రవిసుధీర్, మురళీకృష్ణ తెలిపారు. చన్యుత జేఎన్‌టీయూ యూనివర్సిటీ తరఫున ప్రాతినిధ్యం వహిస్తుందన్నారు. ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకూ కర్ణాటక రాష్ట్రంలో జరిగే ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. ఆమెను కళాశాల చైర్మన్ బోనం కృష్ణసతీష్, ప్రిన్సిపాల్ డాక్టర్ జేవీజీ రామారావు, ఏఓ జక్కం కృష్ణారావు, తదితరులు అభినందించారు.

గృహ నిర్మాణ సాయం పంపిణీ



గృహ నిర్మాణ లబ్ధిదారుకు చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అశోక్

యానాం: యానాం నియోజకవర్గంలో పుదుచ్చేరి మురికివాడల అభివృద్ధి పథకం ద్వారా గృహ నిర్మించుకుంటున్న 74 మందికి రూ.81.70 లక్షలను శుక్రవారం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ అందజేశారు. స్థానిక ప్రభుత్వ అతిథి గృహం వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నియోజవర్గంలో పేదలు పక్కా గృహాలు నిర్మించుకునేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా లబ్ధిదారులకు ఐదు విడతలుగా సహాయం అందుతుందన్నారు. అనంతరం అయ్యన్ననగర్ వద్ద డ్రైనేజీలు సరిగా లేకపోవడంతో ఇబ్బందులు పడతున్నామని గ్రామస్తులు తెలపడంతో రూ.20 లక్షలతో రహదారి, డ్రైనేజీల పునరుద్ధరణకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఆర్ఏఓ మునిస్వామి, స్లమ్ క్లియరెన్స్ బోర్డు జేఈ భాస్కరన్, ఎస్సై మురుగానందం, అయ్యన్ననగర్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యతా లోపంపై ఆగ్రహం



రహదారి మరమ్మతుల తర్వాత బయటకు వచ్చిన గ్రావెల్

యానాం: యానాం పట్టణ పరిధిలో జెండా స్తంభం సెంటర్ నుంచి కనకాలపేట వరకూ సుమారు రెండు కిలోమీటర్ల మేర ప్రధాన రహదారి మరమ్మతుల్లో నాణ్యత లోపంపై శుక్రవారం ఆర్ఏఓ మునిస్వామి సమక్షంలో ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గుంతలు పడిన చోట్ల తారు, గ్రావెల్‌తో పూడ్చే విధంగా సుమారు రూ.6 లక్షలతో పనులు చేపట్టారు. అయితే ఎక్కడా తారును వాడకపోవడంతో పాటు గోతుల్లో గ్రావెల్‌ను వేసి సంబంధిత కాంట్రాక్టర్లు చేతులు దులుపుకొన్నారు. వేసిన పది రోజుల్లోనే గ్రావెల్ బయటకు వస్తుండటంతో అసలు విషయం తెలుసుకుని ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే ఆర్ఏఓ ఆఫీస్‌కు వెళ్లి ఆర్ఏఓ మునిస్వామికి కాంట్రాక్టర్ల తీరును ఎండగట్టారు. ప్రజాధనాన్ని ఈ విధంగా కాంట్రాక్టర్లు దోచుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనకాలపేట గ్రామస్తులు సైతం నిరసన తెలిపి సంబంధితులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

కూటమిలో విశ్వ బ్రాహ్మణులకు మొండిచేయి



సూర్యనారాయణ మూర్తి

అమలాపురం టౌన్: కూటమి ప్రభుత్వం విశ్వ బ్రాహ్మణులను కేవలం ఓటు బ్యాంక్‌గానే వాడుకుందని అమలాపురానికి చెందిన వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణ మూర్తి అన్నారు. ఈ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు విశ్వ బ్రాహ్మణులకు మొండిచేయి చూపిస్తున్నారని ఆరోపించారు. ఈ మేరకు అమలాపురంలో శుక్రవారం సాయంత్రం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. విశ్వ బ్రాహ్మణ పంచాదాయ వృత్తులు వారు పనులు లేక ఇబ్బంది పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అదే గత ప్రభుత్వం విశ్వ బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేసి చైర్మన్, డైరెక్టర్ పదవులు ఇచ్చిందని గుర్తు చేశారు. ఈ ప్రభుత్వంలో ఆ పదవులు లేవన్నారు. విశ్వ బ్రాహ్మణులకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. నామినేటెడ్ పదవుల్లో తగిన స్థానం కల్పించాలన్నారు.

విరబూసిన బ్రహ్మకమలాలు



మొక్కకు విరబూసిన బ్రహ్మ కమలాలు

ఉప్పలగుప్తం: గొల్లవిల్లి పంచాయతీ పరిధి వాడపర్రు గ్రామానికి చెందిన చప్పిడి దుర్గారావు ఇంట్లో బ్రహ్మ కమలాలు విరబూశాయి. శుక్రవారం రాత్రి ఒకే మొక్కకు 64 పుష్పాలు వికసించడంతో స్థానికులు ఆశ్చర్యంగా తిలకించారు. ఏడాదిన్నర కిందట స్నేహితుల దగ్గర నుంచి ఈ మొక్కను తీసుకు వచ్చానని దుర్గారావు అన్నారు. కార్తిక మాసంలో శివునికి ప్రీతికరమైన బ్రహ్మకమలాలు తన నివాసంలో విరబూయడం ఆనందంగా ఉందన్నారు.


గ్రామకంఠం భూముల జోలికి రావొద్దు



గ్రామకంఠం భూమిని శ్మశాన వాటికకు కేటాయించడాన్ని వ్యతిరేకిస్తూ ప్రజల ధర్నా

తాళ్లరేవు: తమ గ్రామ అవసరాలకు వినియోగిస్తున్న గ్రామకంఠం భూముల్లో శ్మశాన వాటికకు స్థలాన్ని కేటాయిస్తూ ఇచ్చిన ఆర్డర్‌ను తక్షణమే వెనక్కి తీసుకోవాలని కోరుతూ గాడిమొగ గ్రామస్తులు ధర్నా శుక్రవారం చేశారు. ఇందులో 50 సెంట్ల భూమిని బాబానగర్ శ్మశాన వాటికకు అప్పగించడాన్ని వ్యతిరేకించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు కామాడి మాతరాజు, మల్లాడి జయన్నారాయణ మాట్లాడుతూ ఈ గ్రామకంఠం భూమి గ్రామంలోని ఆరుగురు దేవతలకు పొలిమేరగా ఉందన్నారు. ఏటా ఆ దేవతలకు పొలిమేర కట్టి సంబరాలు చేసుకుంటున్నామన్నారు. ఈ భూమిలోంచి పవిత్రమైన పుట్ట మట్టిని తీసుకువెళ్లి అమ్మవారి జాతర్లలో వినియోగిస్తామని, గ్రామంలో ఎవరు ఇల్లు కట్టుకున్నా ఇక్కడి నుంచి మట్టి తీసుకువెళ్లి నిర్మాణంలో వాడుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. బాబానగర్ గ్రామస్తులకు శ్మశాన వాటిక కోసం తమ పంచాయతీ నుంచి ఆర్థిక సహాయం అందజేస్తామని, ఈ భూముల జోలికి మాత్రం రావద్దని కోరారు. ఉపసర్పంచ్ కొక్కిలిగడ్డ లోకేష్ మాట్లాడుతూ ఈ భూముల వ్యవహారంపై ప్రజాప్రతినిధులు, అధికారులు గ్రామస్తుల మనోభావాలను దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకోవాలన్నారు. ఇచ్చిన ఆర్డర్లను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామ పెద్దలు కొక్కిలిగడ్డ గంగాధర్‌రావు, కొప్పాడి లక్ష్మణస్వామి, మల్లాడి పేద్రాజు, దోమ వెంకటేశ్వర్లు, మల్లాడి జయన్నారాయణ, సంగాడి వెంకటేశ్వర్లు, లంకే వీరబాబు, కాలాడి తాతారావు, సంగాడి కామేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష బిల్వార్చన



ఎస్.కొత్తపల్లిలో మహాలక్ష్మి అమ్మవారు

ఉప్పలగుప్తం: స్థానిక పార్వతీ సమేత మల్లేశ్వర స్వామివారి ఆలయంలో అర్చకుడు భైరవభట్ల సుబ్రహ్మణేశ్వరశర్మ ఆధ్వర్యంలో లక్ష బిల్వార్చన శుక్రవారం జరిగింది. స్వామివారికి రుద్రాభిషేకం, లక్ష్మీ గణపతి హోమం చేశారు. అనంతరం స్వామివారిని మారేడు దళాలతో పూజించారు. మధ్యాహ్నం అన్న సమారాధన జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఉప్పలగుప్తం: కార్తికమాసం సందర్భంగా ఎస్.కొత్తపల్లి గ్రామంలో మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం కుంకుమార్చనలు జరిగాయి.

తాగునీటి సరఫరాకు నేడు అంతరాయం

ఉప్పలగుప్తం: కూనవరం ప్రాజెక్ట్ నుంచి పలు గ్రామాలకు నీటిని సరఫరా చేసే పైపులైన్ ఉప్పలగుప్తం పంచాయతీ పరిధి సత్తియ్యనాయుడు పాలెం వద్ద మరమ్మతులకు గురైంది. దీంతో శనివారం తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కె.సురేష్ శుక్రవారం తెలిపారు. కూనవరం, మధురపేట, వానపల్లిపాలెం, మునిపల్లి, మునిపల్లి కోటిగట్టు, పేరాయిచెరువు, చినగాడవిల్లి, పెదగాడవిల్లి గ్రామాలకు అంతరాయం కలుగుతుందన్నారు. దీనికి ప్రజలు సహకరించాలని కోరారు.

ధర్నా జయప్రదానికి పిలుపు

తాళ్లరేవు: కాకినాడలో ఈ నెల 26న జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ప్రజా సంఘాల నాయకులు కోరారు. శుక్రవారం స్థానిక కార్యాలయం వద్ద పోస్టర్లు, కరపత్రాలను నాయకులు టి.ఈశ్వరరావు, వడ్డి ఏడుకొండలు, డి.అదృష్టదీపుడు, ఎస్.త్రిమూర్తులు, అనంతలక్ష్మి, మరియమ్మ తదితరులు ఆవిష్కరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా నిర్వహిస్తున్న ఈ ధర్నాకు అధిక సంఖ్యలో ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

రేపు ఉమ్మడి జిల్లా హేతువాద మహాసభ

అమలాపురం టౌన్: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా హేతువాద సంఘం వార్షిక మహాసభను ఆదివారం అమలాపురంలోని ఎస్‌టీయూ జిల్లా కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఈ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కేవీవీ సత్యనారాయణ, డి.రాజశేఖర్‌లు తెలిపారు. మహాసభలో హేతువాదం, మానవ వాదం అధ్యయన తరగతులతో పాటు గ్రంథ ఆవిష్కరణ జరుగుతుందని పేర్కొన్నారు. మహాసభకు హైదరాబాద్‌కు చెందిన భారత హేతువాద సంఘం అధ్యక్షుడు డాక్టర్ గుమ్మా వీరన్న, భారత చైర్మన్ మేడూరి సత్యనారాయణ తదితర సంఘ ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న హేతువాదులు, అభ్యుదయ వాదులు మహాసభకు హాజరుకావాలని వారు విజ్ఞప్తి చేశారు.

నీడలేక అగచాట్లు



మురమళ్లలో బస్సుల కోసం విద్యార్థుల పాట్లు



మురమళ్ల సెంటర్‌లో బస్సుల కోసం రోడ్డు చెంతనే ప్రయాణికుల నిరీక్షణ

- కానరాని బస్ షెల్టర్లు
- ప్రయాణికులకు పాట్లు

ఐ.పోలవరం: ఎండైనా.. వానైనా.. బస్సుల కోసం రోడ్ల వెంబడి పడిగాపులు పడాల్సిందే. అమలాపురం నుంచి కాకినాడ వరకు ఉన్న జాతీయ, రాష్ట్ర రహదారి వెంబడి బస్ షెల్టర్లు లేక ప్రయాణికులు అగచాట్లు పడుతున్నారు. ఆర్టీసీ బస్సుల కోసం తాము రోడ్ల వెంబడి పడుతున్న పాట్లను చూసి కొత్త షెల్టర్లను ఏర్పాటు చేయాలని ప్రయానికులు కోరుతున్నా ఫలితం లేకుండా పోయింది. అమలాపురం నుంచి కాకినాడ మధ్య రోజూ వందల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ముమ్మిడివరం, కాట్రేనికోన, అయినవిల్లి, తాళ్లరేవు, ఐ.పోలవరం, ఉప్పలగుప్తం మండలాలకు చెందిన ప్రజలు జాతీయ రహదారి మీదుగా పుదుచ్చేరి యానాం, కాకినాడ, విశాఖపట్నం వైపు, రావులపాలెం, విజయవాడ, హైదరాబాద్ వైపు, రాజోలు వంటి ప్రాంతాలకు ఆర్టీసీ బస్సుల ద్వారా ఎక్కువగా రాకపోకలు సాగిస్తుంటారు. అలాగే ప్రైవేట్ బస్సులపై కూడా వెళ్తుంటారు. అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల పరిధిలో 216 జాతీయ రహదారి సుమారు 53 కిలోమీటర్ల మేర ఉంది. అమలాపురం, కాకినాడ బస్టాండ్‌లతోపాటు మధ్యలో పుదుచ్చేరి యానాం తప్ప మిగిలిన ప్రాంతాల్లో బస్టాండ్‌లు లేవు. గతంలో ముమ్మిడివరంలో బస్టాండ్ ఉండగా, దానిని ఆర్టీసీ ప్రైవేట్‌కు దీర్ఘకాలిక లీజుకు ఇచ్చింది. దీనితో ముమ్మిడివరంలో ప్రయాణికులు మెయిన్ రోడ్డు వెంబడి నిలబడి బస్సుల కోసం వేచిచూస్తున్నారు. ఎండైనా, వానైనా పడితే సమీప దుకాణాల్లో తలదాచుకుంటున్నారు. మిగిలిన ప్రాంతాల్లో ఆర్టీసీకి గతంలో రెండు మూడు చోట్ల బస్ షెల్టర్లు ఉండగా, జాతీయ రహదారి విస్తరణ పనుల్లో వాటిని తొలగించారు. కొత్త వాటిని నిర్మించలేదు.

ఊరికి దూరం కావడంతో..

అమలాపురం నుంచి పరిశీలిస్తే అమలాపురం ఎర్రవంతెన, కిమ్స్ మెడికల్ కాలేజీ భట్నవిల్లి, ముమ్మిడివరం మండలం అనాతవరం, మహిపాలచెరువు, ముమ్మిడివరం నగర పంచాయతీ, కొమనాపల్లి, ఐ.పోలవరం మండలం మురమళ్ల, ఎదుర్లంక వంతెన, తాళ్లరేవు మండలం కాపులపాలెం జంక్షన్, జార్జిపేట, తాళ్లరేవు, కోరంగి వంటి ప్రాంతాల్లో బస్ షెల్టర్లు లేవు. ప్రయాణికులు నిలబడేందుకు కనీస సౌకర్యాలు లేవు. దీంతో రోడ్లపై ప్రయాణికులు ఎండకు ఎండుతూ.. వర్షానికి తడుస్తూ బస్సుల కోసం పడిగాపులు పడుతున్నారు. విద్యార్థులు, వృద్ధులు, వికలాంగులు ఇలా ఎవరైనా సరే రోడ్ల మీదనే బస్సులు వచ్చే వరకూ ఎదురు తెన్నులు చూడాల్సి వస్తోంది. జాతీయ రహదారుల సంస్థ రహదారి పొడవునా కొన్ని గ్రామాల్లో బస్ షెల్టర్ల నిర్మాణాలు చేశారు. అయితే ఇవి ఊరికి దూరంగా ఉండడం గమనార్హం. అవి నిరుపయోగంగా మారాయి.

సౌకర్యాలు కల్పించాలి

ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి. బస్ షెల్టర్లను నిర్మించడంతోపాటు తాగు నీరు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలి. నగరాల్లో సిటీ సర్వీస్‌ల కోసం అధునాతన బస్ షెల్టర్లను ఏర్పాటు చేస్తున్నారు. కీలకమైన సెంటర్లలో అటువంటివి ఏర్పాటు చేయాలి.

–జంపన రాంబాబు, మురమళ్ల